# బెస్తవానిగాథ

పూర్వకాలంలో ఓ బెస్తవాడు వుంటూ వుండేవాడు. వాడి ఆర్జనమీద ఆధారపడిన భార్యా, ముగ్గురు పిల్లలూ వున్నారు. వాడు ఎంత బీదతనం అనుభవిస్తున్నప్పటికీ, రోజుకి నాలుగుసార్లకన్నా వల విసరరాదనే నియమాన్ని పాటిస్తూ వుండేవాడు.

ఒకరోజున, మామూలుగా, సముద్రతీరానికి వెళ్ళి, గంప కిందెట్టుకుని, వల విసిరి, ఎదురు చూడసాగేడు. వల కదలకుండా వుండేటప్పటికి, దాన్లో యేదో పెద్దచేప పడిందనుకుని సంతోషించేడు. దాన్ని గట్టుకుతీసి చూసేటప్పటికి, అతనికి నిరాశ కలిగేలా, అందులో ఒక గాడిద శవం కనబడింది.

ఆ శవాన్ని అవతలకి తొలగించి వల మళ్లా సర్ది, రెండోసారి సముద్రంలోకి విసిరేడు. రెండోసారి కూడా, వల భారమనిపించగా, చాలా చేపలు చిక్కే యనుకున్నాడు. కాని అందులో ఓ కూజా, ఇసుకతోనూ, మట్టితోనూ నిండివున్నది – బయల్పడింది. తన దురదృష్టానికి వగవలేదు. 'ఇదేదో వింత అదృష్టంలా వుందే!' అని మాత్రం తనలోనే అనుకున్నాడు. దాన్ని తొలగించి, వల కడిగి మూడోసారి దాన్ని విసిరేడు. అప్పుడూ అతనికి పగిలిన కుండ పెంకులూ, గుల్లలూ దొరికేయి.

దాంతో దేవుణ్ణి విధంగా ప్రార్థించుకోసాగేడు: "ఓ భగవాన్! నేను నాలుగు సార్లకన్నా వలవిసరనని నీవు ఎరుగుదువుకదా! నాకు ఇంక ఒకటే అవకాశం వుంది." అలా అంటూనే దాన్ని నాల్గవసారి విసిరి, నిరీక్షించసాగేడు. ఈసారి వల మరీ భారమనిపించింది. కదపడం కష్టమైంది. అందుకని ఇసుకలో ఓ రాట పాతి, దానికి వల చివరిభాగాన్ని కట్టివేశాడు. బట్టలు బిగగట్టి, సముద్రంలోకి వెళ్ళి, కష్టపడి వలఅంతా క్షేమంగా గట్టుకు లాగేడు. ఆతృతతో దానిలోకి చూశేడు. కాని చేపలు ఏమీలేవు, కాని ఒక ఇత్తడిసీసా కనపడింది. దానికి ఓ సీసపు మూత వుంది. దానిమీద ఏవో చిత్రమైన అక్షరాలు గిలికివున్నాయి. అతని మనస్సు సంతోషంతో నిండింది. తనలోనే అనుకోసాగేడు: 'నేను దీనిలో వున్నదంతా తీసుకుంటాను; తర్వాత ఇత్తడి సీసా అమ్ముతాను. నాకు, దానివల్ల కనీసం నాలుగైదు రూపాయలన్నా వస్తాయి.'

సీసా కదిపేడు; ధ్వనేమీ రాలేదు. అప్పుడో చాకు తీసుకుని, సీసపుమూత తెరచేడు. దానిలోని పదార్థాల్ని వొంచాలని ప్రయత్నిస్తే ఏమీ కింద పడలేదు. అదతని కెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. దాన్ని నేలమీద పెట్టి, పరికించసాగేడు. అకస్మాత్తుగా దానినుండి యేదో పొగలా వొచ్చి, ఆకాశాన్నీ, తీరాన్నీ, సముద్రాన్నీ నింపసాగింది. వాడు నివ్వెరబోయి వెనుకంజవేసి, తిలకించసాగేడు. పొగంతా వెలువడ్డాక, అదంతా దగ్గరగా చేరి ఒక ఘనాకృతి దాల్చింది– అది అసహ్యకరమైన, అతి భయంకరమైన రాక్షసరూపం!

బెస్తవాడి గొంతు పొడారిపోయింది; మోకాళ్లు భయంతో వణుకుతో కొట్టుకోసాగేయి; పారిపోవాలనుకున్నాడు గాని అడుగు కదపలేకపోయేడు; తనూ కదలలేకపోయేడు.

"సోలమన్ ప్రభూ! నేను ఎప్పుడూ నీ మీద తిరగబడను" అంటూ అరవసాగేడు రాక్షసుడు.

ఈ మాటలవల్ల బెస్తవాడు కొంచెం ధైర్యం పొందాడు. అందుకని ఇలా ప్రశ్నించేడు: "నువ్వనేది ఏమిటి? సోలమన్ ప్రభువు మరణించి వేలకొద్దీ సంవత్సరాలు గడిచింది. ఆయన్ని గురించి నువ్వేమిటీ అంటున్నావు? అసలు నీ కథేమిటి? ఈ సీసాలోకి ఎట్లా వచ్చావు?"

ఆ రాక్షసుడు భీకరంగా చూస్తో, ఇలా అన్నాడు: "ముందు నీ కథ సంగతి చూసుకో! నేను నిన్ను చంపబోతున్నాను."

"అమ్మ బాబో! నన్నెందుకయ్యా చంపడం? నిన్ను, ఈ సీసానుండి, నేను స్వతంత్రుడ్ని చేశాను కదా!" అన్నాడు బెస్తవాడు వణుకుతో.

"అదేం కుదరదయ్యా! నీకేం తోడ్పడదు. నిన్ను చంపడం మాత్రం తప్పదు. కాని నీకు ఓ వీలు కలిగిస్తున్నాను, నేను. ఏవిధంగా చావదల్చుకున్నావో చెప్పు" అన్నాడు రాక్షసుడు.

"అసలు నేను నీకేం హాని చేశానయ్యా?" బెస్తవాడి దీనాలాపన ఇది.

"నీకు నిజంగా తెల్సుకోవాలని వుంటే నా కథ విను.

"చాలా కాలానికి పూర్వము మేధావంతుడు, శక్తివంతుడు అయిన సోలమన్ అనే మహారాజుపై తిరగబడ్డాను. నన్ను శిక్షించడానికి ఆయన ఈ ఇత్తడి సీసాలో బంధించి, సీసపు బిరడా పెట్టి, మాంత్రికశక్తితో మూసివేశాడు. తర్వాత ఆ సీసా సముద్రంలో పారవేయమని ఆజ్ఞాపించేడు. అప్పుడు నా మనస్సులో నేను: "నన్నెవ్వరు స్వేచ్ఛాజీవిని చేస్తారో వాళ్ళని శాశ్వతంగా ధనవంతుల్ని చేస్తాను" అనుకున్నాను. వందేండ్లు గడిచేయి. కాని ఎవరూ నాకు స్వేచ్ఛనీయలేదు. రెండోసారి: "నాకు స్వేచ్ఛ నిచ్చినవారికి ప్రపంచాధిపత్యం అంటగడతా"నని ప్రతిజ్ఞ పట్టాను. మరో వంద సంవత్సరాలు గడిచేయి. కాని నాకు స్వేచ్ఛ ప్రాప్తించలేదు. ఈసారి మరీ గొప్ప ప్రతిజ్ఞ పట్టేను: "నన్ను స్వతంత్రుడిగా చేసిన వ్యక్తివద్ద నిరంతరమూ వుండి, అతని మూడు కోరికల్ని అనుదినమూ నెరవేరుస్తుంటాను. ఐనా నన్నెవరూ విడిపించలేదు. ఆఖరికి నా కోపం అధికమైపోయింది. ఓ భీకరమైన ప్రతిజ్ఞ తీసుకున్నాను.

అదేమిటంటే, ''నాకు స్వేచ్ఛనిచ్చిన వ్యక్తిని చంపేస్తాను''అని. నువ్విప్పుడు నాకు స్వేచ్ఛనుకలిగించేవు కనుక నువ్వు మరణించడానికి తయారుగా వుండాలి!"

బెస్తవాడు కరుణించమని ప్రాధేయపడ్డాడు. కాని రాక్షసుడు కోపంతో అరవసాగేడు "త్వరగా మరణించదల్చుకున్న మార్గాన్ని గురించి చెప్పు; కాలం వృథా అవుతోంది."

బెస్తవాడికి ఆ ఆపదనుండి బయటపడడానికి తెలివితేటలు ఉపయోగించడమే మార్గాంతర మనిపించింది. అతని మనస్సులో ఓ ఉపాయం తోచింది.

వెంటనే ఇలా అన్నాడు: "నేను ఎలాగా చావాలి కనుక నిన్నో ప్రశ్న అడుగుదామను కుంటున్నాను. ఈ సీసా నీ పాదం కూడా పట్టనంత చిన్నదిగా వుంది. నువ్వసలు సీసాలో వున్నావంటే నేను నమ్మలేకుండా వున్నాను."

"నే నందులోనే వున్నాను; నీకెందుకు సందేహం?" అని రాక్షసుడు జవాబిచ్చేడు.

"నేను నీ శరీరమంతా దానిలోకి పోవడాన్ని కళ్ళారా చూస్తేనేగాని నమ్మలేను" అని కొసిరేడు బెస్తవాడు.

బుద్ధితక్కువరాక్షసుడు వెంటనే పొగగా మారి, ఇదివరకులాగే సీసాలోకి పోసాగేడు.

సీసాలోంచి: "ఇప్పుడు నేను సీసాలో వున్నాను; నీకు నమ్మకం కుదిరిందా ఇప్పుడైనా?" అనే ధ్వని వినపడింది.

మాటలు వచ్చీ రాకుండానే బెస్తవాడు సీసపు బిరడాని తీసి, దానికి బిగించేశాడు.

"ఓ రాక్షసుడా! ఇప్పుడు నువ్వు క్షమాభిక్ష కోరుకో. ఏ రకమైన మరణం కావాలో కోరుకో. కాదులే-నిన్ను మళ్ళీ సముద్రంలోకి విసిరివేయడమే మంచిది" అన్నాడు వాడు.

రాక్షసుడు బయల్పడడానికి యత్నించేడు. కాని తాంత్రికమైన మూతలవలన రాలేకపోయేడు. అందువల్ల మరో ఎత్తు ఎత్తేడు:

"నువ్వు మూత తీసినట్టయితే, నీకు గొప్ప బహుమానం ఇస్తాను" అన్నాడు.

బెస్తవాడు, "లాభంలేదు; నిన్ను మరోసారి నమ్మలేను" అంటూ సీసాని సముద్రంలోకి దొర్లించేశాడు.

*08. 02. 1956-ఆంధ్ర సచిత్ర వారపత్రిక*